సాక్షి
అనంతపురం

శనివారం ׀ 23 ׀ మార్చి ׀ 2024



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



'రిలయన్స్'లో దోపిడీకి కుట్ర

అనంతపురం రిలయన్స్ మార్ట్‌లో దోపిడీకి పన్నిన కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్టు చేశారు.

IIలో

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.32	సెహరీ : 5.05



న్యూస్‌రీల్

రిటర్నింగ్ అధికారుల నియామకం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులను (ఆర్‌ఓ) ఎన్నికల కమిషన్ నియమించింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి వ్యవహరిస్తారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఉరవకొండ రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ నియమితులయ్యారు. రాయదుర్గం ఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆన్‌సెట్ సీఈఓ ఎస్.కరుణకుమారి, గుంతకల్లు ఆర్‌ఓగా ఆర్డీఓ వి.శ్రీనివాసులురెడ్డి, తాడిపత్రి ఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డి, శింగనమల ఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెన్నెల శ్రీను, అనంతపురం అర్బన్ ఆర్‌ఓ ఆర్డీఓ జి.వెంకటేష్, కళ్యాణదుర్గం ఆర్‌ఓగా ఆర్డీఓ రాణీ సుస్మిత, రాప్తాడు ఆర్‌ఓగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంతబాబు వ్యవహరిస్తారు. ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నియోజకవర్గం ఆర్‌ఓ వద్ద నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు ఆర్‌ఓల చేతుల మీదుగా డిక్లరేషన్ అందుకుంటారు.

3,274 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 3,274 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 142 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 37,293 మందికి గాను 34,019 మంది హాజరయ్యారు.

- అలాగే సార్వత్రిక విద్యా పీఠం పరీక్షల్లో భాగంగా ఇంటర్ విద్యార్థులు 1,349 మందికి గాను 1,259 మంది, పదో తరగతి విద్యార్థులు 882 మందికి గాను 799 మంది హాజరయ్యారు.

వలంటీర్లూ.. అధైర్యపడొద్దు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



తాడిపత్రి: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించడంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థలో గౌరవవేతనంతో పనిచేస్తున్న వలంటీర్ల సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కొనియాడారు. వీరి సేవలను చూసి ఓర్వలేని టీడీపీ, జనసేన పార్టీ నేతలు అనేక రకాల ఆంక్షలను విధించేలా చూడడంతో పాటు బెదిరింపులకూ దిగుతుండడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి వాటికి అధైర్యపడకూడదన్నారు. తాడిపత్రిలోని తన నివాస గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు అందించిన సేవలే సార్వత్రిక ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయన్నారు. ఇదే వరుసలో యానిమేటర్లు, రేషన్ డీలర్లకూ చోటు దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే పాలనను చేరువ చేసిన వలంటీర్ల కృషి అనితర సాధ్యమన్నారు. అలాగే ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్లు, మహిళా సంఘాల ఆర్థిక ప్రగతికి దోహదం చేసేలా యానిమేటర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వీరి సేవలను చూసి టీడీపీ, జనసేన నాయకులకు కంటి మీద కునుకు దూరమైందన్నారు. దీంతో వలంటీర్లు, యానిమేటర్లు, రేషన్ డీలర్లను భయాందోళనకు గురి చేసేలా బెదిరింపుల పర్వానికి ప్రతిపక్ష పార్టీలు తెరలేపాయన్నారు. బెదిరింపులపై ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాబోయేది జగనన్న ప్రభుత్వమేనన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్న బాధ్యతలు స్వీకరించిన వెంటనే వలంటీర్లు, యానిమేటర్లు, రేషన్ డీలర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

పరిటాల శ్రీరామ్ వర్గీయులకు రిమాండ్

బత్తలపల్లి: బీజేపీ నాయకుడు వరదాపురం సూరి వర్గీయులు, పరిటాల శ్రీరామ్ వర్గీయుల మధ్య ఈనెల 4న బత్తలపల్లి కూడలిలో చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి శుక్రవారం శ్రీరామ్ వర్గీయులు ఆరుగురికి జడ్జి రిమాండ్ విధించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 4వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు పెనుకొండ సమీపంలో బహిరంగ సభను నిర్వహించారు. చంద్రబాబు వద్ద బల ప్రదర్శన చేసేందుకు వరదాపురం సూరి, పరిటాల శ్రీరామ్ పోటాపోటీగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బత్తలపల్లిలోని టీడీపీ పార్టీ కార్యాలయం ముందు ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 30 వాహనాలు ధ్వంసంకాగా, పలువురు గాయపడ్డారు. ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా శ్రీరామ్ వర్గీయులు అప్పస్వామి, కిరణ్, మోహన్, నల్లప్ప, కాటమయ్య, నాగరాజులను శుక్రవారం అరెస్టు చేసి ధర్మవరం కోర్టులో హాజరు పరిచారు. జడ్జి వారికి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నాలుగులో మూడు పెండింగే

- అసమ్మతుల బెడదతో ఆపసోపాలు
- ఎమ్మెల్యే సీటు ఆశించి ఎంపీ సీటుతో సర్దుకున్న బీకే
- అనంతపురం, గుంతకల్లు సీట్లపై తేల్చని చంద్రబాబు
- అనంతపురం ఎంపీ సీటు జేసీ పవన్‌కు ఇచ్చేందుకు మొగ్గు!
- ధనబలం కలిగిన అభ్యర్థులు బీసీల్లో లేనందునే పవన్ వైపు మొగ్గు
- పార్టీకి పనిచేసిన వారికి ప్రాధాన్యం లేదంటున్న తెలుగు తమ్ముళ్లు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: సార్వత్రిక ఎన్నికల వేళ అడుగడుగునా అసమ్మతుల బెడద తెలుగుదేశం పార్టీని వేధిస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు ప్రజాబలం ఉన్న వారికంటే ధనబలం ఉన్నవారికి సీట్లు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగానే రెండు ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు ప్రకటించాల్సి ఉండగా.. తాజాగా వచ్చిన జాబితాలో హిందూపురం ఎంపీ టికెట్ మాత్రమే ప్రకటించారు. మిగతా అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు గుంతకల్లు సీటు వెల్లడించలేదు. ఇక్కడ ఎవరికి టికెట్ ఇస్తే ఎవరు ధర్నాలకు దిగుతారోనన్న భయం బాబును వెంటాడుతున్నట్టు తెలుస్తోంది.

బీసీల్లో డబ్బున్నవారు లేరని..

తెలుగుదేశం పార్టీకి 30 ఏళ్లుగా జెండా మోసింది బీసీ వర్గాలే. అలాంటి బీసీ వర్గాలను బాబు తన మనసులోనుంచి చెరిపేశారు. ఓ వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు పార్లమెంటు సీట్లనూ బీసీలకు కేటాయించింది. టీడీపీ మాత్రం అతి కష్టమ్మీద హిందూపురం టికెట్‌ను బీసీ వర్గానికి చెందిన పార్థసారథికి ఇచ్చింది. అనంతపురం టికెట్ మాత్రం బాగా డబ్బున్న జేసీ పవన్‌కు ఇవ్వాలని చూస్తున్నారు. పవన్ అయితే పార్టీకి కోట్ల రూపాయలు ఇవ్వగలరని, బీసీల్లో అలా డబ్బు ఇచ్చే నేతలు ఎక్కడున్నారనేది చంద్రబాబు అభిప్రాయం. మరోవైపు కుటుంబానికి ఒక్కటే సీటు అని పరిటాల కుటుంబానికి రెండు సీట్లు ఇవ్వకుండా, జేసీ కుటుంబానికి మాత్రం రెండు సీట్లు ఇస్తుండటంపైనా బాబు తన మార్కు రాజకీయం చేస్తున్నారనేది కేడర్ భావన.

ఆ రెండింటిపై పీటముడి

అనంతపురం అర్బన్ సీటును ముందు జనసేనకు ఆశచూపి.. తర్వాత తెలుగుదేశం పార్టీ లాగేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఇప్పటికే బలిజలు ఆగ్రహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎవరికి టికెట్ ఇస్తే ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందో అని ఇంకా అభ్యర్థిని తేల్చలేదు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి టికెట్ తనదే అంటూ ప్రచారం చేస్తున్నారు. బాబు తనకే హామీ ఇచ్చినట్టు కూడా చెబుతున్నారు. అయినా సరే ప్రకటించలేదు. ఈ సీటు ప్రభాకర్‌చౌదరికి ఇస్తే బలిజలతో పాటు వివిధ వర్గాలు ఆయనకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

- ఇక గుంతకల్లు ఎమ్మెల్యే టికెట్ తనదే అని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం చెబుతున్నారు. ఇక్కడ సీటు ఎవరికనేది వెల్లడిస్తే మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ నుంచి ఎలాంటి అసమ్మతి వస్తుందోనన్న భయం పట్టుకుంది. మొన్నటిదాకా జయరాంను పేకాట మంత్రి అని, బెంజ్‌కారు మంత్రి అని తిట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఆయనకే సీటు ఇస్తున్నట్టు వస్తున్న వార్తలను టీడీపీ కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. దీన్నిబట్టి చూస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రతి నియోజకవర్గంలోనూ అసమ్మతుల బెడదతో టీడీపీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు తెలుస్తోంది.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

అనంతపురం: పోక్సో కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష పడింది. ఈ మేరకు అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. అసోం రాష్ట్రానికి చెందిన పప్పుబాగ్ అలియాస్ రాజు గార్లదిన్నె మండల కేంద్రంలో ఓ కూరగాయల మండీలో పనిచేసేవాడు. ఓ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. శారీరకంగా కలిశాడు. గర్భం దాల్చిన అనంతరం అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు.. గతేడాది మే 26న అప్పటి గార్లదిన్నె ఎస్‌ఐ సాగర్ పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అత్యంత ప్రాధాన్యతగా స్వీకరించి బాధితురాలికి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి కేసును 20 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. ఈ కేసులో 14 మంది సాక్షులను విచారించి..ముద్దాయి పప్పుబాగ్ అలియాస్ రాజుకు పదేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ అనంతపురం పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి శుక్రవారం తీర్పు వెలువరించారు. స్పెషల్ పీపీ కె.విద్యాపతి ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ చౌరెడ్డి, శ్రీనివాసులు, నాగార్జున, రజాక్‌లు సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరిచి ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేశారు. వీరందరినీ ఎస్పీ అభినందించారు.

'పది' స్పాట్ రెమ్యునరేషన్ భారీగా పెంపు

- స్పెషల్ అసిస్టెంట్లకు రూ.137 నుంచి రూ. 300
- జవాబుపత్రాలు దిద్దేందుకు ఒక్కో పేపరుకు రూ.6.60 నుంచి రూ.10
- సీఈలకు రూ.264 నుంచి రూ.396
- ఏసీఓలు, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు, క్యాంపు ఆఫీసర్ రెమ్యునరేషన్ల పెంపు
- ఏప్రిల్ 1 నుంచి 10 వరకు మూల్యాంకనం



జిల్లాకు చేరిన జవాబు పత్రాలను స్ట్రాంగ్‌రూంకు తరలిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం విధుల్లో పాల్గొంటున్న అన్ని కేడర్లకూ ఈసారి రెమ్యునరేషన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు పదేళ్ల తర్వాత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని కేడర్ల కంటే స్పెషల్ అసిస్టెంట్లకే రెమ్యునరేషన్ తక్కువ వచ్చేది. రోజుకు రూ.137 మాత్రమే వచ్చేది. మండుతున్న ఎండలకు తోడు ఆశించిన స్థాయిలో రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంతోనే చాలామంది టీచర్లు స్పెషల్ అసిస్టెంట్లుగా వచ్చేందుకు ఆసక్తి చూపేవారు కాదు. రోజూ 300 మంది అవసరమైతే 60 మందికూడా వచ్చేవారు కాదు. దీంతో వీరి నియామకం అధికారులకు తలనొప్పిగా ఉండేది. ప్రతి ఏడాది స్పాట్ ప్రారంభమైనా స్పెషల్ అసిస్టెంట్ల కోసం వెంపర్లాడే పరిస్థితి ఉండేది. ఇకపై అధికారులకు ఆ ఇబ్బంది ఉండదు. ఎందుకంటే స్పెషల్ అసిసెట్లకు ఆశాజనకంగా రెమ్యునరేషన్ ఉండబోతోంది. ఈ ఏడాది నుంచి రూ.300 ఇవ్వనున్నారు. అంటే దాదాపు 110 శాతం వరకు పెంచారు. 'స్పాట్' క్యాంపులో పాల్గొనే అన్ని కేడర్ల వారికి రెమ్యునరేషన్, డీఏ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏప్రిల్ 1 నుంచి 'స్పాట్' ప్రారంభం

జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి టెన్త్ స్పాట్ ప్రారంభం కానుంది. ఎప్పటిలాగానే నగరంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. అప్పుడే జవాబుపత్రాలు రావడం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే తెలుగు జవాబు పత్రాలు దాదాపు 34 వేల దాకా వచ్చాయి. హిందీ జవాబు పత్రాలూ వచ్చాయి. ఇవన్నీ స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తున్నారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లు, సీఈల, ఏసీఓల నియామక ప్రక్రియ జరుగుతోంది.

రెమ్యునరేషన్ల పెంపు ఇలా..

చీఫ్ ఎగ్జామినర్లు (సీఈ), అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు (ఏసీఓ), డెప్యూటీ క్యాంపు ఆఫీసర్లు, క్యాంపు ఆఫీసర్‌ల రెమ్యునరేషన్ కూడా పెరిగింది. సీఈలకు గతంలో రోజుకు రూ.264 ఇస్తుండగా దాన్ని రూ.396కు పెంచారు. ఏసీఓ (వాల్యుయేషన్)లకు రూ.286 నుంచి రూ.429కు పెరిగింది. ఏసీఓ (కోడింగ్)లకు రూ.198 నుంచి రూ. 297కు పెంచారు. డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లకు రూ.330 నుంచి రూ.495 పెంచారు. క్యాంపు ఆఫీసర్‌కు రూ.385 నుంచి రూ.578 పెంచారు.

- అలాగే పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగంగా ఇన్విజిలేటర్లకూ రెమ్యునరేషన్ పెరిగింది. కంటింజెంట్ పనులకు ఒక్కో విద్యార్థిపై రూ.8 నుంచి రూ.10కు పెంచారు. డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ మాట్లాడుతూ మూల్యాంకనం విధుల్లో పాల్గొనే అన్ని కేడర్ల వారికీ ప్రభుత్వం రెమ్యునరేషన్ పెంచిందన్నారు.

పెంపు నిర్ణయం సంతోషదాయకం



పదో తరగతి పరీక్షల నిర్వహణ, కోడింగ్ పనులు, స్పాట్ వాల్యుయేషన్ సిబ్బందికి సంబంధించిన రెమ్యునరేషన్‌పై గత సంవత్సరంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈసారి అమల్లోకి వచ్చింది. పదేళ్ల తర్వాత అన్ని కేడర్ల ఉద్యోగులకూ రెమ్యునరేషన్ పెంచడం సంతోషకరం. ప్రభుత్వ నిర్ణయం పట్ల ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు.

– పి.అశోక్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్

బాధితురాలిపైనే ఎస్సీ, ఎస్టీ కేసు

- ప్రేమ పేరుతో యువతిని వంచించిన కౌన్సిలర్ మల్లికార్జున
- కౌన్సిలర్‌కు అండగా నిలిచిన జేసీ ప్రభాకర్‌రెడ్డి
- అనుచరుడిని కాపాడుకునేందుకు తల్లి చేత కౌంటర్ కేసు

తాడిపత్రి అర్బన్: న్యాయం కోసం తనను ఆశ్రయించిన బాధితురాలిపై మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కర్కశంగా వ్యవహరించారు. తన అనుచరుడైన కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జునను కాపాడేందుకు అతడి తల్లిచేత బాధితురాలిపై కౌంటర్ కేసు నమోదు చేయించారు. మల్లికార్జునకు ఫేస్‌బుక్ ద్వారా పట్టణానికి చెందిన యువతితో పరిచయం ఏర్పడింది. ఫోన్ నంబర్, చిరునామా తెలుసుకుని ఏకంగా ఆమె ఇంటికే రాకపోకలు సాగిస్తూ ప్రేమలోకి దింపాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడు. అనంతరం ఆమె గర్భం దాలిస్తే అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకోవాలని అడిగితే దాటవేస్తూ వచ్చాడు. మరొక అమ్మాయితో చాటింగ్‌లు చేస్తున్నాడని తెలిసి నిలదీసింది. దీంతో ఆమెను విపరీతంగా కొట్టాడు. తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని యువతి ఇటీవల అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. వారం కిందట కౌన్సిలర్ మల్లికార్జునపై ఐపీసీ 376, 506, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారు. తన అనుచరుడైన మల్లికార్జునను కాపాడుకునేందుకు జేసీ ప్రభాకర్‌రెడ్డి రంగంలోకి దిగి హంగామా చేశారు. యువతిదే తప్పన్నట్టు ప్రచారం చేశారు. అంతటితో ఆగక కేసును నీరుగార్చేందుకు ఎత్తుగడ వేశారు. న్యాయం చేయాలంటూ ఇంటివద్దకు వచ్చిన సమయంలో తమను కులం పేరుతో దూషించిందంటూ యువతిపై కౌన్సిలర్ తల్లి సావిత్రమ్మ చేత అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. దీంతో సదరు యువతిపై ఐపీసీ 506 సెక్షన్ కింద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

న్యాయం చేయమని అడగడం తప్పా?

తనకు జరిగిన అన్యాయంపై మల్లికార్జున కుటుంబీకుల దృష్టికి తీసుకెళ్లి తనకు న్యాయం చేయండని అడగడం కూడా తప్పేనా అని బాధిత యువతి ప్రశ్నించింది. తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్నానని తెలిపింది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారని చెప్పింది.

ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–19) రెగ్యులర్, సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ, బీ ఫార్మసీ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

సింహ వాహనంపై నారసింహుడు



సింహవాహనంపై తిరువీధుల్లో దర్శనమిస్తున్న శ్రీవారు

- వైభవంగా కొనసాగుతున్న ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో నాల్గో రోజైన శుక్రవారం స్వామి వారు సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ అర్చకులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. తనకు ప్రీతి పాత్రమైన ఈ సింహ రూపంలోనే స్వామివారు నరసింహ అవతారమెత్తి హిరణ్య కశ్యపుని సంహరించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు స్వామి వారు తిరువీధుల్లో ఊరేగుతుంటే వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సింహవాహన సేవ ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన నిరంజన్, కదిరికి చెందిన మాడిశెట్టి నరసయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



వాహనం ముందు తమిళనాడుకు చెందిన డోలు,నాదస్వర బృందం

నేడు హనుమంత వాహనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఖాద్రీశుడు హనుమంత వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన రామావతారంలో రాక్షస సంహారం అనంతరం రామలక్ష్మణులను హనుమంతుడు తన భుజస్కంధాలపై ఎత్తుకొని భక్తిని చాటుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. నరసింహావతారంలో కూడా హిరణ్యకశ్యపుని సంహారం అనంతరం శ్రీమహావిష్ణువును హనుమంతుడే సాక్షాత్తు తన భుజస్కంధాలపై మోస్తాడని భక్తుల నమ్మకం.

కోడ్ పటిష్టంగా అమలు చేయాలి

- రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సీఈఓ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ–మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంలో పనిచేస్తున్న ఉద్యోగులు, వలంటీర్లు ఎవ్వరూ రాజకీయపార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్నారు. ఎంసీసీ, ఇతర అంశాలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాల ప్రహరీలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో రాజకీయ పార్టీల హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లు, ఫొటోలు, లోగోలు ఉండకూడదన్నారు. ప్రైవేటు భవనాలపై వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండకూడదన్నారు. ఆయా శాఖల జిల్లా అధికారులు సంబంధిత మండల, క్షేత్రస్థాయి అధికారులతో టెలీ, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించుకుని ఎంసీసీ 100 శాతం అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంసీసీ అమలవుతోందా లేదా అనేదానిపై నిరంతరం తనిఖీలు చేయాలని చెప్పారు. కోడ్ అమలులో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్‌ఓలు అధికారులతో సమావేశాలు నిర్వహించి కోడ్ పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. కోడ్ ఉల్లంఘనపై కమాండ్ కంట్రోల్ రూమ్ వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. సి–విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరించాలని, నివేదికను సకాలంలో అందజేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డికి కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఉపాధి పనులు, కరువు మండలాలు, తాగునీరు, తదితర అంశాలపై శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో ఉపాధి పనులు, తాగునీటి సరఫరా విషయంలో చేపట్టిన వేసవి కార్యాచరణ ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమె వివరించారు. జిల్లాలోని 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పీఏబీఆర్‌లో ప్రస్తుతం 1.50 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. వేసవిలో మూడు నెలలకు ఇబ్బంది లేకుండా నీరు సరఫరా అయ్యేలా తీసుకున్న చర్యలను వివరించారు. అలాగే కరువు మండలాల్లో ఉపాధి పనులు విస్తృతంగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పటిష్ట చర్యలు చేపట్టాం

జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనాకు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఎన్నికల సన్నద్ధత, ఇతర అంశాలపై సీఈఓ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి పాల్గొన్నారు. జిల్లాలో కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు కరుణకుమారి, వెన్నెల శ్రీను, నోడల్ అధికారులు భాస్కర్, ఉమామహేశ్వరమ్మ, ఎంసీఎంసీ మానిటరింగ్ సెక్రెటరీ గురుస్వామిశెట్టి, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, ఎస్‌వీసీ డీఐఓ రవిశంకర్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

కవితల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్, దళిత బహుజన తత్వంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా తెలిపారు. కవితలను ఏప్రిల్ 5వ తేదీలోపు 94408 05955 వాట్సాప్ నంబర్‌కు పంపాలని కోరారు.

‘రిలయన్స్’లో దోపిడీకి కుట్ర

- ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన ‘అనంత’ పోలీసులు
- నిందితుల్లో ఇద్దరు పాత నేరస్తులే


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: జిల్లా కేంద్రంలోని రిలయన్స్ మార్ట్‌లో దోపిడీ చేసేందుకు పన్నిన కుట్ర భగ్నమైంది. ముగ్గురు సభ్యులుగా ఉన్న ముఠాను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు వేట కొడవళ్లు, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

మార్ట్‌తో పాటు వర్తకుడి ఇల్లు లూటీకి కుట్ర

అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న రిలయన్స్ మార్ట్‌తో పాటు హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న ఓ వర్తకుడి ఇంటిని లూటీ చేసేందుకు కుట్ర పన్నిన ముఠా సభ్యులు ముందుగా రెక్కీ నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ముఠా సభ్యుల కదలికలపై అనుమానం వచ్చిన ఎస్పీ అన్బురాజన్ వెంటనే డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డిని అప్రమత్తం చేశారు. ఆయన నేతృత్వంలో రంగంలో దిగిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం ఉదయం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద వెళుతున్న ఆటోను అడ్డుకుని పరిశీలించారు. అందులో మూడు వేట కొడవళ్లు, ఐరన్‌రాడ్ లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని, అందులో ప్రయాణిస్తున్న గుజ్జల రుశ్యంగులు, రాగిరి శ్రీనివాసులు, గొల్ల చంటిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో రిలయన్స్ మార్ట్ దోపిడీతో పాటు వర్తకుడి ఇల్లు లూటీకి కుట్ర విషయం వెలుగు చూసింది. నిందితులను అరెస్ట్ చేసి, ఆటోను సీజ్ చేశారు.

పథకం రూపొందించుకుని...

బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన రుశ్యంగులు ప్రస్తుతం అనంతపురంలోని భాగ్యనగర్‌లో నివాసముంటున్నాడు. అలాగే రాగిరి శ్రీనివాసులు అనంతపురంలోని హమాలీ కాలనీలో, గొల్ల చంటి శెట్టూరు మండలం ఐదుకల్లులో నివాసముంటున్నారు. వీరిలో రుశ్యంగులుపై పామిడి, గుత్తి, రాప్తాడుతో పాటు శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీ కేసులున్నాయి. అనంతపురం వన్‌టౌన్ పరిధిలో ఓ హత్య కేసు కూడా ఉంది. గొల్ల చంటిపై అనంతపురం రెండు, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడు చోరీ కేసులున్నాయి. తొలుత గుజరీ, సిల్వర్ సామాన్ల వ్యాపారం చేసే రుశ్యంగులు అందులో నష్టం రావడంతో రూ.7 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. ఆ అప్పులు తీర్చుకునేందుకు రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తున్న తనకు దూరపు బంధువైన రాగిరి శ్రీనివాసులు, గొల్ల చంటిని సంప్రదించాడు. ఈ క్రమంలో రిలయన్స్‌లో రోజు వారీ వ్యాపారంలో భాగంగా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వస్తుంటుందని, ఈ మొత్తాన్ని ప్రతి రోజూ మేనేజర్ తీసుకెళ్లి బ్యాంక్‌లో జమ చేస్తుంటాడని శ్రీనివాసులు వివరించాడు. దీంతో మేనేజర్‌ను అడ్డగించి ఆ నగదు అపహరించుకెళ్లాలని ముగ్గురూ కలసి పథకం రచించారు. ఇందు కోసం రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలోనే హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న ఓ వర్తకుడి ఇంట్లో వృద్ధురాలు, కుమార్తె, ఓ బాలుడు మాత్రమే ఉంటారని తెలుసుకున్న వారు... ఆ ఇంటినీ లూటీ చేయాలని పథకం వేశారు. ఈ క్రమంలో తమను ఎవరైనా అడ్డగిస్తే నిర్దాక్షిణ్యంగా హతమార్చాలని నిర్ణయించుకున్నారు. తాము రూపొందించుకున్న పథకం మేరకు శుక్రవారం ఉదయం హౌసింగ్ బోర్డు వైపుగా ఆటోలో వెళుతుండగా వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సిబ్బంది గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు

రూ.2.50 లక్షలు అపహరణ

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి వద్ద నుంచి రూ.2.50 లక్షలను దుండగులు అపహరించుకెళ్లారు. ఆద్యంతం సినీ ఫక్కీలో జరిగిన ఘటనకు సంబంధించి వివరాలు... శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన రామకృష్ణ... కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న ఏపీజీబీలో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం స్థానిక టీడీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న బ్యాంక్ ప్రధాన కార్యాలయం నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచుకుని తాను పనిచేస్తున్న బ్యాంక్ శాఖకు బయలుదేరాడు. మార్గమధ్యంలో గాంధీ చౌక్ వద్ద ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని, కాసేపటి తర్వాత బయటపడి బ్యాంక్ వద్దకు చేరుకుని పరిశీలిస్తే సైడ్ బ్యాగ్‌లో ఉంచిన నగదు కనిపించలేదు. విషయాన్ని వెంటనే బ్యాంక్ సిబ్బందికి తెలిపి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు వెంటనే గాంధీ చౌక్ చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. జ్ఞాన భారతి స్కూల్ సమీపంలో ఖాళీ బ్యాగ్ మాత్రమే దొరికింది. అందులో ఉంచిన నగదు కనిపించలేదు. డబ్బు తీసుకుని బ్యాగ్ అక్కడ పారేసి ఉంటారని పోలీసులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాస్తవాలు ప్రచురించండి

ఉరవకొండ: ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహార ప్యాకెట్లపై ముఖ్యమంత్రి ఫొటోకు స్టిక్కర్ అతికించి తాము సరఫరా చేస్తే... సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉన్న వాటిని పంపిణీ చేసినట్లు ఆంధ్రజ్యోతిలో తప్పుడు కథనం ప్రచురించారంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడేలా వాస్తవాలు ప్రచురించాలని హితవు పలికారు. వజ్రకరూరు మండలం చాబాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న శశికళ, సోమేశ్వరి, చంద్రమణి, సరోజ శుక్రవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము ఎలాంటి పరిస్థితుల్లోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదన్నారు. ప్రతి ప్యాకెట్‌పై ఉన్న సీఎం ఫొటోపై స్టిక్కర్ అతికించి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. తాము వేసిన స్టిక్కర్లను తొలగించి తప్పుడు కథనాలు ప్రచురించి తమపై దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఎల్లో మీడియా సాగిస్తున్న కుట్రను అర్థం చేసుకోకుండా తమకు షోకాజ్ మెమో జారీ చేయడం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాస్తవాలు గుర్తించాలని కోరారు.

వర్సిటీ విద్యార్థుల పల్లె బాట


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాల విద్యార్థులు పల్లెబాట పట్టారు. కిమ్స్ సవేరా హాస్పిటల్ సహకారంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రామినేపల్లిలో సమగ్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ సి.శశిధర్ హాజరయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, 2డీ, 3డీ, ఎకో, ఈసీజీ రక్త వర్గీకరణ పరీక్షలు చేశారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. పరిశుభ్రత, పారిశుధ్యం, సాధారణ వ్యాధుల నివారణ తదితర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.మమత, కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు బాలకిశోర్, నీరజ, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 22 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ–2024)లో భాగంగా డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఏప్రిల్ 22 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడు చేసుకుని పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డుల్లో ఏదో ఒకటి వెంట తీసుకెళ్లాలి.

‘మార్కెటింగ్’ లక్ష్య సాధనపై సంతృప్తి


సమీక్షిస్తున్న ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది మార్కెటింగ్ శాఖ నిర్దేశించుకున్న లక్ష్య సాధనపై ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన మార్కెట్ కమిటీలు నెలాఖరులోపు వంద శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో పురోగతిపై స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎంఎల్ఎస్ మూర్తితో కలసి మార్కెట్‌యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో శుక్రవారం ఆయన సమీక్షించారు. అనంతపురం జిల్లా పరిధిలోని 9 మార్కెట్ కమిటీలు, చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.10.91 కోట్ల వసూళ్ల టార్గెట్ ఇవ్వగా ప్రస్తుతానికి 99 శాతం లక్ష్యసాధనతో రూ.10.72 కోట్లకు పైగా వసూలు చేయడాన్ని అభినందించారు. శింగనమల కమిటీ ద్వారా అత్యధికంగా 125 శాతం సాధించగా అనంతపురం, తాడిపత్రి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం కమిటీలు వంద శాతాన్ని అధిగమించాయన్నారు. గుత్తి 68 శాతం, గుంతకల్లు 63 శాతం, రాప్తాడు 85 శాతంతో కాస్త వెనుకబడినందున నెలాఖరులోపు సాధ్యమైనంత మేర పురోగతి సాధించాలని ఆదేశించారు. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్‌కమిటీలకు ఈ ఏడాది రూ.4.72 కోట్లు లక్ష్యం ఇవ్వగా ప్రస్తుతానికి 96 శాతంతో రూ.4.50 కోట్లకు పైగా సాధించినట్లు తెలిపారు. ఇందులో పుట్టపర్తి కమిటీ అత్యధికంగా 154 శాతంతో ముందు వరుసలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. గోరంట్ల, కదిరి కూడా వంద శాతాన్ని అధిగమించినట్లు తెలిపారు. మడకశిర 99 శాతం, ధర్మవరం 91 శాతం, పెనుకొండ 88 శాతం, హిందూపురం 76 శాతం, చివర్లో తనకల్లు కేవలం 54 శాతం వసూళ్లు సాధించినట్లు తెలిపారు. ఇంకా 10 రోజుల పాటు గడువున్నందున అన్ని కమిటీలు వంద శాతం మార్కును చేరుకునేలా విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ఫేసియల్ అటెండెన్స్ పాటించాలన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అనుసరించాలన్నారు.

డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు ‘అనంత’ వాసి


చాకలి గంగాధర్

అనంతపురం: జమ్మూకాశ్మీర్ వేదికగా ఏప్రిల్ 16 నుంచి 19వ తేదీ వరకూ జరిగే డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐడీసీఏ టీ–20) క్రికెట్ పోటీలకు రాప్తాడు మండలం చిన్మయనగర్‌కు చెందిన చాకలి గంగాధర్ ఎంపికయ్యాడు. ఇటీవల చేపట్టిన ఎంపిక పోటీల్లో బౌలింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచి సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. 8 రాష్ట్రాల జట్లు తలపడే ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ జట్టులో గంగాధర్‌కు చోటు దక్కడంపై బధిరుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గోవా మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

తాడిమర్రి: గోవా నుంచి అక్రమంగా తరలించుకు వచ్చిన 24 బాక్స్‌ల మద్యం బాటిళ్లను శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ నాగస్వామితో కలసి డీఎస్పీ శ్రీనివాసులు వివరాలను వెల్లడించారు. ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన కే.షాహిద్‌ఖాన్ ఈనెల 12న అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో రూ.11 లక్షలకు ఒక లారీ కొనుగోలు చేశాడు. అనంతరం తాడిపత్రిలోని టైలర్స్ కాలనీలో నివాసం ఉంటున్న శింగనమల మండలం కొరివిపల్లికి చెందిన దూదేకుల కుళ్లాయప్పను డ్రైవర్‌గా పెట్టుకుని గోవాకు వెళ్లాడు. అక్కడ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్‌కు మద్యం సప్లయ్ చేసే బ్లాక్ అనే యాప్‌ను ఓపెన్ చేసి అందులో డ్రైవింగ్ లైసెన్స్, లారీ ఆర్సీ, ఆధార్‌కార్డులు, పాన్‌కార్డులు అప్‌లోడ్ చేశారు. దీంతో అక్కడ జెమినీ అనే డిస్టరీల్లో 850 కేసుల మద్యాన్ని అధికారికంగా లోడ్ చేసుకున్నారు. ఆ మద్యాన్ని వారు మదనపల్లి, చిత్తూరు, రేణిగుంటలో దింపాల్సి ఉంది. అయితే తిరుగు ప్రయాణంలో గోవాలోనే 90 బాక్స్‌లను అక్రమంగా లారీ పైభాగంలో వేసుకుని హుబ్లీ, ధార్వాడా, గుంతకల్లు, గుత్తి, అనంతపురం మీదుగా బత్తలపల్లికి తీసుకొచ్చారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన మాలపాటి రవితేజకు కొంత భాగాన్ని విక్రయించారు. అనంతరం మిగిలిన మద్యాన్ని యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి అందజేయడానికి వెళ్తుండగా శుక్రవారం దాడితోట సమీపంలోని పుల్లుట్ల కనుమలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మాన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లు 110, 180 ఎంఎల్ బాటిళ్లు 720 మొత్తం రూ.1.50 లక్షలు విలువచేసే మద్యాన్ని పట్టుకున్నారు. కే.షాహిద్ ఖాన్, దూదేకుల కుళ్లాయప్ప, తిమ్మంపల్లికి చెందిన లోచర్ల హరికృష్ణ, నీరుగంటి నాగరాజు, సుందు సురేష్, ధర్మవరం పట్టణానికి చెందిన కోటం దేవానంద్, ఏటూరు రవికుమార్, మర్రిమాకులపల్లికి చెందిన కమ్మ నరేష్‌ను అరెస్టు చేశారు. మద్యం బాక్స్‌లను, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి ధర్మవరం కోర్టుకు హాజరు పర్చినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అక్రమ మద్యాన్ని పట్టుకున్న ఎస్ఐ నాగస్వామిని, సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

కణేకల్లు: స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని బొల్లనగడ్డం చెక్ పోస్టు మీదుగా ఆరు బాక్సుల్లో అక్రమంగా తరలిస్తున్న 562 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బొమ్మనహాళ్ మండలం కలువళ్లి గ్రామానికి చెందిన తిమ్మప్ప శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు సెబ్ సీఐ మురళీకిషోర్ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో అనంతపురం స్పెషల్ పార్టీ సీఐ రఘు, కణేకల్లు సెబ్ ఎస్ఐ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన ఉండాలి

- వర్షపునీరు, భూగర్భజలాల సంరక్షణ అవసరం
- అంతర్జాతీయ జల దినోత్సవంలో వక్తలు వెల్లడి


మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి


అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో భూగర్భజలాల వినియోగంపై రైతులతో పాటు ప్రజలూ అవగాహన కలిగి ఉండాలని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ ఇన్‌చార్జి డీడీ బీఎంవీ రఘునాథరెడ్డి, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవ రెడ్డి అన్నారు. నీటి వినియోగంపై అవగాహన ఉన్నప్పుడే తాగు, సాగునీటి సమస్యను అధిగమించవచ్చునన్నారు. అనంతపురంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ‘అంతర్జాతీయ జల దినోత్సవం’లో వారు మాట్లాడారు. గత నాలుగేళ్లు విస్తారంగా వర్షాలు కురిశాయన్నారు. అయితే ఈ ఏడాది సాధారణ వర్షపాతం 513 మి.మీ కాగా 36.8 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయన్నారు. దీంతో చాలా ప్రాంతాల్లో తాగు, సాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2 లక్షల బోరుబావులు ఉండగా అధిక నీటి వాడకం కారణంగా ఈ పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అరటి, ఇతర ఉద్యాన పంటలకు నీటి అవసరం ఎక్కువగా ఉన్నందున చెట్ల చుట్టూ ఆకులు, పొట్టు లాంటి వాటితో ఆర్గానిక్ మల్చింగ్ విధానాన్ని అవలంభించాలని తెలిపారు. మల్చింగ్ ఏర్పాటుకు సంబంధించి ప్రతి రైతుకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున ఇస్తే కొంతవరకు ఉపశమనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా పంటలకు మోతాదుకు మించి నీరు పెట్టకూడదన్నారు. పంట పొలాల్లో రైతులు తప్పనిసరిగా వాన నీటిని ఒడిసి పట్టుకునేందుకు, భూగర్భజలాలను పెంపొందించుకునేందుకు ఫారంపాండ్లు, చెక్‌డ్యాంలు, ట్రెంచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటి ద్వారా బెట్ట నుంచి పంటలను కాపాడుకోవచ్చునన్నారు. బెట్ట పరిస్థితులు ఉన్నపుడు వరి లాంటి అధిక నీటి వినియోగం ఉన్న పంటలకు విరామం ఇవ్వాలన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో మేలు రకం నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ మాస్ ప్రతినిధి కళామణి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ప్రతినిధులు బ్రహ్మేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలు సీజ్


పట్టుబడ్డ నగదును లెక్కిస్తున్న అధికారులు

రాయదుర్గం రూరల్: స్థానిక గాలి మారెమ్మ గుడి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్ఎస్ బృందం చేపట్టిన తనిఖీల్లో రూ.1.50 లక్షల నగదు పట్టుబడింది. ఈ మేరకు రాయదుర్గం రూరల్ సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు గ్రామానికి చెందిన కురుబ పాండు... ఆటోలో కర్ణాటక నుంచి నగదు తెస్తూ పట్టుబడ్డాడన్నారు. నగదు తరలింపునకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని ఏఈఆర్ఓ (తహసీల్దార్) చిట్టిబాబుకు స్వాధీనం చేసినట్లు వివరించారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవుడు



యాడికి: మండల కేంద్రంలో వెలసిన శివల శ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత వాహనంపై కోదండరాముని అలంకారంలో భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు హరికృష్ణశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే విశేష పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. మద్దాల సుబ్రహ్మణ్యం, ఈశ్వరయ్య, భాస్కర్, వెంకటశేషఫణి, విశ్వనాథ్ ఉభయదారులుగా వ్యవహరించగా... రాత్రి 10 గంటలకు హనుమంత వాహనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్, జేసీ నారాయణ రెడ్డి, రమేష్‌రెడ్డి, పందు శ్రీరాములు, ఆది తదితరులు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

క్షయ నివారణకు కృషి చేయాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ సాగింది. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిపై ఉన్న అనుమానాలు, అపోహలు, భయాలను పోగొట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నిర్మూలనకు అందించే వైద్య సేవలు, పారితోషికం, మార్గదర్శకాలను వ్యాధి గ్రస్తులకు తెలియజేయాలన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.500 అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల కో–ఆర్డినేటర్ డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా కుష్టు ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబులు, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరప్ప, పలమనాలజిస్టు డాక్టర్ సుధీంద్ర, డిప్యూటీ డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనాధికారి గంగాధర్, క్షయ విభాగం సిబ్బంది శ్రావణి, మహేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు



ఆర్ఐ మురళీకి రూ.13 లక్షల చెక్కు అందిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ నిర్వాహకులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో శుక్రవారం ఇంటి, ఖాళీ జాగా పన్ను రూ.45,46,204 వసూలైంది. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో అదనపు కమిషనర్ శ్రీహరి బాబు పర్యవేక్షణలో ఆర్ఓలు సతీష్, సుజాత, ఆర్ఐలు మురళీ, వేణు, పద్మావతి, బాబు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మొండి బకాయిదారులకు నోటీసులను జారీ చేశారు. కమలానగర్‌లో ఓ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు ఒకేసారి రూ.13 లక్షల చెక్కును ఆర్ఐ మురళీకి అందించారు. తద్వారా కాంప్లెక్స్ నిర్వాహకులకు రూ.8 లక్షల వడ్డీ మాఫీ అయినట్లు ఆర్ఓ సతీష్ పేర్కొన్నారు. అసెస్‌మెంట్‌దారులు సకాలంలో పన్ను చెల్లించి వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి



మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరిగాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పారిశుద్ధ్య కార్మికులను కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం 5:30 గంటలకు నగరంలోని మూడవ సర్కిల్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆప్రాన్ వేసుకుని పని చేయాలని కార్మికులకు సూచించారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలన్నారు. కాలువల్లోనూ పూడికతీత పనులు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో నిర్దేశించిన సమయంలో క్లాప్ ఆటోలు చెత్త సేకరణ పనులు విధిగా చేపట్టాలన్నారు. మధ్యాహ్నం నగరంలోని రాంనగర్‌లోని సిద్దార్థ పార్క్‌లో జరుగుతున్న కాంపౌండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎన్నికల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు

రాప్తాడు: కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల్లో పని చేసే సిబ్బంది చురుగ్గా పని చేయాలని రాప్తాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి వసంత బాబు మాట్లాడుతూ.. ప్రతి ఫ్లయింగ్ స్క్వాడ్‌కు వెహికల్ ఇస్తామని, యాప్ ద్వారా ప్రతి రోజు రిపోర్టు చేయాల్సి ఉందని తెలిపారు. 66 పేజీల నిబంధనలు పాటించాలన్నారు. ఏ సమస్య ఉత్పన్నమయినా 50 నిమిషాల్లో మీ పరిధిలో, 100 నిమిషాల్లో నా పరిధిలో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. రహదారిపై చెక్ పోస్టుల్లో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. రూ.50 వేలు మించి ఎవరూ తీసుకెళ్లినా ఆధారాలు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పత్రికలు, పలు టీవీల జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.

అందుబాటులోకి అత్యాధునిక వైద్యం

- నాడు–నేడు ద్వారా మారిపోయిన ఆస్పత్రులు, పాఠశాలల రూపురేఖలు
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 47వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో చిన్న పాటి సమస్య వస్తేనే కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్‌కు పరుగులు తీయాల్సిన దారుణమైన పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలకు ఖరీదైన విద్య, వైద్యాన్ని ప్రజలకు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 47వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. గత ఎన్నికల్లో ఏవిధంగా ఆశీర్వదించారో రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని బలోపేతం చేసి, అత్యాధునిక వైద్యాన్ని జిల్లా కేంద్రంలోనే అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 8 రకాల స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గుండె, న్యూరో, గ్యాస్ట్రో, తదితర విభాగాల్లో పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. నగరంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నూతనంగా ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో నాలుగింటిని ప్రారంభించడం జరిగిందని.. మరో రెండు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఒక్కో పట్టణ ఆరోగ్యం కేంద్రం నిర్మాణం కోసం రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగతా నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల పునరుద్ధరణ పనులకు రూ.40 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 60 రకాల పరీక్షలు, 174 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. కుక్క, పాముకాటుకు సైతం మందులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లోనూ మరింత అభివృద్ధి చేసి చూపుతామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థ నాయక్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, కార్పొరేటర్లు దుర్గాదేవి, లీలావతి, రహంతుల్లా, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, అబూసలేహ, టీవీ చంద్రమోహన్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు మధు, పీవీ రమణారెడ్డి, నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, నిమ్మల నాగరాజు, వనారస బలరాం, జానీ, సాకే కుళ్లాయస్వామి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, జావెద్, రామచంద్ర, గౌరి, భారతి, అనిత, అంజలి, సుజాత రెడ్డి, జాహ్నవి రెడ్డి, సుహాసిని, అనిల్‌కుమార్ గౌడ్, తానిషా తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. వీరి మద్దతుతో మరోసారి తాను ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం పాతూరులోని జంగాలపల్లి మసీదులో జరిగిన రంజాన్ సామూహిక ప్రార్థనల్లో ఎమ్మెల్యే అనంత పాల్గొన్నారు. ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియాజ్ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం

రఫీ కుటుంబానికి 'అమ్మ' అండ



రఫీకి సాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ స్వచ్ఛంద సంస్థ ఓ అభాగ్యుడికి అండగా నిలిచింది. వివరాలు.. నగరంలో నివసిస్తున్న శిరయాల రఫీ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత ఫిబ్రవరిలో జరిగిన ఓ ప్రమాదంలో రఫీ తీవ్రంగా గాయపడ్డాడు. కుడి చేయి, కుడి కాలికి గాయాలు కావడంతో మంచానికి పరిమితమయ్యాడు. దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. రఫీకి సర్జికల్‌చైర్, వీల్ చైర్, మందులు, ఫిజియోథెరపీ అవసరమని వైద్యులు నిర్ధారించారు. వైద్యుల సూచనల మేరకు వాటిన్నింటినీ అందించడానికి అమ్మ సంస్థ ముందుకు వచ్చింది. రూ.35 వేలతో మంచం, రూ.10 వేలు విలువ చేసే వీల్ చైర్ ఇవ్వడమే కాకుండా రూ.30 వేలతో నిత్యావసర వస్తువులను అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అందజేశారు. అంతే కాకుండా ఇద్దరు పిల్లల పేరిట మరో రూ.30 వేలు డిపాజిట్ చేయించారు. భవిష్యత్తులో రఫీ వైద్య ఖర్చులకు సాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు.

అతివలదే పైచేయి



- ఆత్మకూరు మండలంలో మహిళా ఓటర్లే అధికం
- ఎన్నికల్లో కీలకం కానున్న మహిళలు
- మండలంలో మొత్తం ఓటర్లు 33,264
- కొత్త ఓటరు దరఖాస్తుకు ఏప్రిల్ 25 వరకూ అవకాశం

ఆత్మకూరు: రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, అందులో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలో 26 గ్రామాలు ఉన్నాయి. 17 పంచాయతీల్లో 39 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటిలో 33,264 మంది ఓటర్లు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం మండల వ్యాప్తంగా దాదాపు 3 వేల ఓట్ల వరకూ పెరిగాయి. అంతేకాకుండా ప్రస్తుతం ఆత్మకూరు మండల వ్యాప్తంగా మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. మండల వ్యాప్తంగా పురుష ఓటర్లు 16,566 మంది ఉండగా.. మహిళా ఓటర్లు 16,698 మంది ఓటర్లు ఉన్నారు. ఇతరుల విభాగానికి సంబంధించి మండల వ్యాప్తంగా ఒక ఓటు ఉంది. మండలంలో అత్యధికంగా మేజర్ పంచాయితీలో 7 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. దీంతో ఇంకా మండలంలో ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి అని చెప్పవచ్చు.

అర్హులందరికీ పథకాలు

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగనన్న ఆధ్వర్యంలో పార్టీలు, కుల మతాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేశారు. దీంతో గతంలో కన్నా ఈ సారి ఆత్మకూరు మండలంలో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ ఎక్కువగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 16,771 ఓట్లు పోల్ కాగా.. టీడీపీకి 10,353 ఓట్లు పోల్ అయ్యాయి. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి సొంత మండలంలో 6,418 మెజార్టీని ప్రజలు బహుమతిగా ఇచ్చారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధి, అందజేసిన సంక్షేమ పథకాలను పరిశీలిస్తే ప్రజలు వైఎస్సార్‌సీపీకే మొగ్గు చూపే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో కన్నా ఈసారి వైఎస్సార్‌సీపీకి ఎక్కువగా మెజార్టీ ఖాయమని ప్రజలు చెబుతున్నారు.

పంచాయతీల వారీగా ఓటర్ల వివరాలు

పంచాయితీ	పోలింగ్ కేంద్రాల సంఖ్య	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు
సిద్ధరాంపురం	2	666	701	1367
పి. యాలేరు	3	1,228	1,257	2,485
సింగంపల్లి	1	371	367	738
సింగంపల్లి తండా	1	284	288	572
ఆత్మకూరు	9	3,676	3,778	7,454
పంపనూరు	1	638	629	1,267
ముట్టాల	2	1,167	1,156	2,323
గొరిదిండ్ల	1	715	808	1,523
వేపచెర్ల	2	530	493	1,023
వీఈ తండా	1	237	237	474
తలుపూరు	2	1,043	1,054	2,097
వడ్డుపల్లి	1	592	613	1,205
మదిగుబ్బ	2	1,074	1,021	2,095
జి.యాలేరు	2	1,063	1,095	2,158
సనప	4	1,420	1,403	2,823
రంగంపేట	1	419	425	844
తోపుదుర్తి	4	1,443	1,373	2,816
మొత్తం	39	16,566	16,698	33,264

ఓటరు నమోదుకు మరో అవకాశం



సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఏప్రిల్ 25వ తేదీ వరకూ కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తులను పరిశీలించిన తరువాతే వీరిని ఓటర్ల జాబితాలో చేరుస్తాం. అయితే ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు. 18 సంవత్సరాల వయస్సు నిండిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – పరమేశ్వర స్వామి, తహసీల్దార్

పరిటాల ఇలాకాలో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన శేషంపల్లి గ్రామస్తులు

రామగిరి: మాజీ మంత్రి పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో టీడీపీకి షాక్ తగిలింది. శుక్రవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో మండలంలోని శేషంపల్లి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో టీడీపీకి చెందిన ఉప్పర ఆంజనేయులు, కంసల శివ వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా టీడీపీ బలోపేతానికి తాము ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ తమకు తగిన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సామాజిక వర్గానికే పెద్దపీట వేయడంతో విసుగు చెందామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు నచ్చి వైఎస్సార్‌సీపీలోకి వచ్చామన్నారు. అనంతరం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలు ఇస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి మరోసారి సిద్ధపడిన ప్రతిపక్షాల కూటమిని ఎవరూ నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలో గతంలో సాధించిన దానికంటే అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ నరేంద్ర, మజ్జిగ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ధర్మోపనయనాలు

అనంతపురం కల్చరల్: బ్రాహ్మణ ఉపనయన సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర భగవత్పాదుల జయంతి సందర్భంగా ఉచితంగా సామూహిక బ్రాహ్మణ ధర్మోపనయనాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రఘురామారావు, శివరాం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 10వ తేదీపు లోపు వటువు వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440090060, 9441506811 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నీటి శుద్ధిపై అవగాహన

అనంతపురం కార్పొరేషన్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి ప్రాముఖ్యతను తెలియజేయడానికి కమిషనర్ మేఘ స్వరూప్ చర్యలు తీసుకున్నారు. శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయ స్కూల్ విద్యార్థులను ఈఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో ముద్దలాపురం ఫిల్టరేషన్ పాయింట్‌కు తీసుకెళ్లారు. నగరానికి సరఫరా చేసే నీటిని ఏవిధంగా శుద్ధి చేస్తారు? ఇందుకు ఎంత ఖర్చు అవుతుంది? తదితర వివరాలను ఈఈ సూర్యనారాయణ తెలియజేశారు.

విధులకు డుమ్మా



ప్లానింగ్ విభాగాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జెడ్పీలోని అనేక విభాగాలు శుక్రవారం బోసిపోయాయి. కొందరు ఉద్యోగులు ఎన్నికల విధులకు వెళ్లగా.. చాలా మంది డుమ్మా కొట్టడంతో సీట్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆకస్మిక తనిఖీలో ఇవన్నీ బయటపడ్డాయి. శుక్రవారం మధ్యాహ్నం వివిధ ప్రాంతాల నుంచి పనుల మీద వచ్చిన వారికి సీట్లన్నీ ఖాళీగా దర్శనిచ్చాయి. దీంతో కొందరు చైర్‌పర్సన్ గిరిజమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె 3:30 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా ప్లానింగ్ విభాగంలో కేవలం ఇద్దరు మహిళా ఉద్యోగినులు మాత్రమే ఉండగా.. మిగిలిన సెక్షన్లలో ఒక్కరంటే ఒక్కరూ లేకుండాపోయారు. దీంతో చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనానికని ఇళ్లకెళ్లేవారు కనీసం 3:30 గంటలకు కూడా విధులకు హాజరుకాకపోతే ఎలాగని ప్రశ్నించారు. గతంలో కూడా చాలా సార్లు మందలించినా ఉద్యోగుల్లో మార్పు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఎలాగంటూ నిలదీశారు. సెక్షన్ ఏఓలు కూడా కొందరు అనధికారికంగా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరే విధులకు డ్యూటీకి డుమ్మా కొడితే.. కింది స్థాయి సిబ్బందిని ఎవరు నియంత్రిస్తారని ప్రశ్నించారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు డుమ్మాకొట్టిన వారికి ఇదే చివరి హెచ్చరిక అని మందలించారు.

ఇంజినీరింగ్‌లో నైపుణ్యాలు అవసరం



వేణు మోటర్స్ సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న కళాశాల యజమాన్యం

రాప్తాడు: ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధనలు చేయడం ద్వారా మెరుగైన మేధాశక్తిని సంపాదించాలి. విద్యలో ప్రతిభా నైపుణ్యాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని వేణు మోటర్స్ సంస్థ సీఈఓ దేవిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్వీ ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్. శర్మ అధ్యక్షతన ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో వేణు మోటర్స్ సంస్థ 5 రోజుల పాటు ఎలక్ట్రిక్ వెహికల్స్ అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాపు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం బెంగళూరుకు చెందిన వేణు మోటర్స్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, కళాశాల ఎండి రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి, ఏఓ వెంకట శివా రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ విజయ భాస్కర్, ఈఈఈ విభాగపతి రాజగోపాల్, డీఐఓ షెక్షావలి, కో–ఆర్డినేటర్లు సబిహా, వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనంతకు చేరుకున్న శృంగేరి పీఠాధిపతి



మాట్లాడుతున్న శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీతీర్థ స్వామీజీ

అనంతపురం కల్చరల్: ధర్మప్రచార యాత్రలో భాగంగా శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీతీర్థ స్వామీజీ శుక్రవారం రాత్రి అనంతకు చేరుకున్నారు. నగరంలోని శారదా శంకర శృంగేరి మఠంలో మూడు రోజుల పాటు సాగనున్న శారదామాత పంచలోహ విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకాల్లో స్వామీజీ విశిష్ట అతిథిగా పాల్గొంటారు. మఠం పరిసరాలకు చేరుకున్న స్వామీజీకి వందలాది మంది భక్తులు మేళతాళాలతో ఆహ్వానించారు. శంకరమఠంలో ధూళిపాదపూజలు, చంద్రమౌళీశ్వర పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ ఆధ్యాత్మిక భావన, ధర్మమార్గం విశిష్టతను వివరించారు. నిర్వాహకులు ఎం.ఎస్ సత్యప్రసాద్ మాట్లాడుతూ స్వామీజీ చేతుల మీదుగా శనివారం ఉదయం ప్రతిష్ఠాంగహోమం, పాదపూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం శతావధాని గన్నవరం లలితాదిత్య సంస్కృతాంధ్ర ద్విగుణితాష్టావధానం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు స్వామీజీ తీర్థ ప్రసాదాలనందించారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: రాష్ట్రంలో ప్రతి ఇంటికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారు. సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది కోరారు. శుక్రవారం మండలంలోని మైనార్టీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అధికారం కోసం మళ్లీ చంద్రబాబు పొత్తులతో వస్తున్నారని ఓటుతో ఆయనకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అగ్ని బోర్డు చైర్మన్ కేశవ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గవ్వల పరంధమ, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నల రవికుమార్, సాకే చంద్ర, జయన్న, వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, చిరుతల నాగేంద్ర, గంజి అభి తదితరులు పాల్గొన్నారు.







పిచ్చుకా క్షేమమా

ఐ లవ్ స్పారోస్!!

మనిషి తన సౌకర్యం కోసం ప్రకృతి సమతుల్యతకు విఘాతం కలిగిస్తూనే ఉంటాడు. ప్రకృతి సహనంతో ఓర్చుకుంటూ, అప్పుడప్పుడూ విలయం రూపంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటుంది. మొత్తంగా తనను తాను సమతుల్యం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. 'మాయమైపోతున్నదమ్మ మనిషన్నవాడు'... అని పిచ్చుకలు ఆవేదన చెందుతున్న సమయంలో ప్రకృతిఓ అమ్మాయి మనసును కదిలించింది. ఆమె ఇప్పుడు పక్షి ప్రేమికురాలైంది. తన ఇంటిని పక్షులకు విలాసంగా మార్చింది. తాను పక్షి ప్రేమికురాలిగా మారిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు మంచాల హరిణి.

హరిణి

అడవికి దాహం వేసింది!

''అప్పుడు నేను బీబీఏ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నాను. అమ్మా నాన్న, నేను, అక్క అందరం ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మా పెద్ద నానమ్మ వాళ్ల ఊరికి వెళ్తున్నాం. నిర్మల్ దాటి కడెం మీదుగా అడవిలో ప్రయాణిస్తున్నాం. మే నెల కావడంతో ఎండ తీవ్రంగా ఉంది. చెట్ల మొదళ్లు ఎండిపోయి వానల కోసం ఎదురు చూస్తున్నాయి. ఓ పక్షి మా కళ్ల ముందే చెట్టుకొమ్మ మీద నుంచి జారి నేల మీద పడింది. కొద్ది సెకన్లపాటు రెక్కలు కొట్టుకున్నాయి. కారాపి వెళ్లి చూశాం, పక్షిని చేతుల్లోకి తీసుకుని మా దగ్గరున్న నీటిని చల్లి, తాగించడానికి ప్రయత్నించాం. కానీ ఆ పక్షి అప్పటికే ప్రాణాలు వదిలేసింది. ఆ చిన్న ప్రాణికి ఎన్ని నీళ్ల కావాలి, ఆ గుక్కెడు నీళ్లు లేకనే కదా ప్రాణం పోయిందని చాలా బాధేసింది. ఆ దృశ్యం పదే పదే కళ్ల ముందు మెదలసాగింది. ఇలాగ ఒక్కో వేసవికి ఎన్ని పక్షులు ప్రాణాలు కోల్పోతున్నాయో కదా... అనిపించింది. ఏదైనా చేయాలనిపించింది. కానీ ఏం చేయాలనేది వెంటనే స్ఫురించ లేదు.

పిచ్చుకలు వచ్చాయి!

పక్షులకు నీటికోసం ఇంటిముందు చిన్న పాత్రలో నీటిని పెట్టడం మొదలు పెట్టాను. పావురాలు ఇతర పక్షుల కంటే పిచ్చుకలే ఎక్కువగా రాసాగాయి. దాంతో పర్మినెంట్ సొల్యూషన్ కోసం ఆలోచిస్తున్నప్పుడు పిచ్చుకల సైజ్‌ని కూడా దృష్టిలో పెట్టుకుని ఫీడర్ బాక్స్ డిజైన్ చేశాను. ఇందుకోసం ఇంటర్‌నెట్‌లో చాలా సెర్చ్ చేశాను. మహారాష్ట్ర, నాసిక్‌లోని ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే ఫ్యాక్టరీ వాళ్లతో మాట్లాడి నాక్కావలసిన డిజైన్‌ను వివరించాను. వాళ్లు రఫ్ తయారు చేసి వాట్సాప్‌లో పంపించేవారు.



'బర్డ్ ఫీడర్ బాక్స్' పంపిణీ చేస్తున్న హరిణి (కుడివైపు)

ప్లాస్టిక్ డబ్బాకు కిటికీల్లాగ ఓపెన్‌గా ఉంచి చిన్న ప్లాస్టిక్ రాడ్‌ను పెట్టించాను. పక్షి ఆ రాడ్ మీద నిలబడి, తెరిచి ఉన్న కిటికీలో ముక్కు పెట్టి గింజలను తింటుంది. నీటి కోసం డబ్బా కింద సాసర్ పెట్టించాను. నాకు సంతృప్తి కలిగే వరకు డిజైన్‌ను మారుస్తూ చేసిచ్చారు వాళ్లు. ఐదేళ్ల కిందట ఇదే తొలి డిజైన్. మొదట వంద పీస్‌లు చేయించి బంధువులు, స్నేహితులకిచ్చాను. తర్వాత అందరూ అడుగుతుండడంతో పెద్ద మొత్తంలో చేయిస్తున్నాం. తాతయ్య పేరుతో 'మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్' ద్వారా అందరికీ పంచుతున్నాం. ఒక మంచి పని చేయడం, అది కూడా మా తాతయ్య పేరుతో చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికి రెండువేలకు పైగా ఇలాంటి డబ్బాలను పంచాను. ఇప్పుడు నేను యూఎస్‌లో పీజీ చేస్తున్నాను. నేను మొదలు పెట్టిన పనిని మా నాన్న కొనసాగిస్తున్నారు. మా చేతిమీదుగా ఈ బర్డ్ ఫీడర్ బాక్స్‌లు అటు ఆదిలాబాద్, నాందేడ్ వరకు, ఇటు హైదరాబాద్, సూర్యాపేట, గుంటూరుకు కూడా చేరాయి. ఈ బాక్స్ కావాలని ఎవరడిగినా వాళ్ల అడ్రస్ పంపిస్తే చాలు కొరియర్ చార్జ్‌లు కూడా మేమే భరించి ఉచితంగా పంపిస్తాం. వంద మాటలు చెప్పడం కంటే ఒక మంచి పని చేయడం మేలని నమ్ముతాను. ఐదేళ్ల నుంచి ఈ పని చేస్తున్నప్పటికీ నేను ఎక్కడా ప్రచారం చేసుకోలేదు. ఐ లవ్ స్పారోస్ అనేది ఈ ఏడాది వరల్డ్ స్పారో డే (మార్చి 20)సందర్భంగా ప్రపంచం ఇచ్చిన పిలుపు. కానీ నేను పిచ్చుకలను ప్రేమించడం ఎప్పుడో మొదలైంది. నేను అందరినీ కోరుకునేది ఒక్కటే. ఆ చిన్న ప్రాణుల కోసం రోజూ ఓ లీటరు నీటిని పెడదాం'' అన్నారు మంచాల హరిణి.

– వాకా మంజులారెడ్డి

చుక్క నీరుంటే చాలు!

గుప్పెట్లో పట్టుకుంటే నిండా గుప్పెడంత కూడా ఉండదు. పిచ్చుకంత ప్రాణం. రేడియేషన్ బారిన పడి అల్లాడిపోతోంది. అభివృద్ధి పేరుతో మనిషి చేసే అరాచకానికి భయపడిపోతోంది. మనిషి కంటపడకుండా పారిపోతోంది. ఏకంగా ఈ భూమ్మీద నుంచే మాయమైపోదామనుకుంటోంది. మనసున్న మనిషి కరవైన నేల మీద తనకు మనుగడ లేదని ఊరు వదిలి పారిపోయింది. అడవుల బాట పట్టి ఏ చెట్టుకొమ్మనో తనను తాను దాచుకుంటూ నీటిచుక్క కోసం వెతుక్కుంటోంది. మనిషి మనసులో ఆర్ద్రత, గుండెలో తడి ఉందని తెలిసిన పిచ్చుక మళ్లీ రెక్కలు టపటపలాడిస్తోంది. వందలాది బంధుగణంతో నిజామాబాద్‌లో మంచాల హరిణి ఇంటి ముందు కొలువుదీరింది. ఈ మాత్రం ఆలంబన దొరికితే చాలు... కిచకిచలతో ఊరంతటికీ వీనులవిందు చేస్తానంటోంది పిచ్చుక.

చిరుతలు

ధైర్యంగా ఉండమని చెప్పడం అందరూ చేసే పనే.
ధైర్యాన్ని ప్రదర్శించడం కొందరు చేసేది.
ప్రమాదంలోనూ ధైర్యాన్ని చూపడం అతి కొద్ది మందే చేస్తారు.
ఆ అతి కొద్దిమందిలోనూ మేటిగా నిలుస్తున్నారు
హైదరాబాద్‌లోని బేగంపేట వాసులైన ఈ తల్లీ కూతుళ్లు.
ఇంట్లోకి అకస్మాత్తుగా చొరబడిన ఆగంతకులపైకి
చిరుతపులుల్లా విరుచుకుపడ్డారు.
మారణాయుధాలతో బెదిరించినా ఆత్మస్థైర్యాన్ని బెదరనివ్వలేదు.
ఇద్దరు దుండగులను తరిమి తరిమి కొట్టిన తల్లి అమిత మెహోత్.
తల్లిని కాపాడుకునేందుకు దుండగులతో వీరోచితంగా పోరాడిన కూతురు బాబీ.



బాబీ



అమిత, బాబీలను సత్కరిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

దుండగులు ఎలా ఎప్పుడు ఎక్కడ నుంచి వస్తారో, ఎలా దాడి చేస్తారో మనం ఊహించలేం. అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో తెలియక ధనాన్నే కాదు ప్రాణాలను సైతం కోల్పోయేవారెందరో. కానీ, ప్రాణాలను కూడా లెక్క చేయకుండా దుండగుల దుశ్చర్యను క్షణమాత్రంలోనే గుర్తించి, ఆ వెంటనే తమ స్థైర్యాన్ని చూపి నేడు ఎంతో మంది ప్రశంసలు అందుకుంటున్నారు అమిత, బాబీ. స్త్రీలు సబలలు అని నిరూపించిన ఈ వనితలు నేడు ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

''ఎప్పుడో ప్రాక్టీస్ చేసిన బాక్సింగ్‌తో పాటు 15 ఏళ్లుగా చేస్తున్న జిమ్ వ్యాయామాలు, వీటికి తోడు మార్షల్ ఆర్ట్స్‌పై అవగాహన.. ఇవన్నీ దుండగులు తుపాకీ గురి పెట్టినా ఏమాత్రం బెదరక ధైర్యంగా నిలబడేలా చేశాయి. దోచుకోవడానికి వచ్చిన వారిని తరిమి కొట్టేలా చేశాయి'' అని తెలిపింది నలభై ఆరేళ్ల అమిత. ఊహించని విధంగా ఆ తల్లీకూతుళ్ల నుంచి ప్రతిఘటన ఎదురవడంతో దుండగులు కాళ్లకు బుద్ధి చెప్పాల్సి వచ్చింది.

కొరియర్ బాయ్స్ వేషంలో..

ఆన్‌లైన్ అమ్మకాలు పెరిగాక కొరియర్ బాయ్స్ మన ఇళ్ల ముందుకు వస్తుంటారు. వారి గురించి మనకేవిధంగానూ తెలియదు. అలాగని, కొరియర్ వారంతా ప్రమాదకారులే అని మనం చెప్పలేం. కానీ, ఒక్కోసారి సమస్య ఈ విధంగానూ మనల్ని పలకరించవచ్చు అని గ్రహించాలి అనడానికి గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన మన కళ్లకు కడుతుంది. ''మా ఇంటి గుమ్మానికి, ప్రధాన గేటుకు 200 ఫీట్ల దూరం ఉంటుంది. కొరియర్‌బాయ్స్ ఎవరొచ్చినా గేటు బయటనే ఉండి పిలుస్తారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బ్యాగ్‌తో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకరు హెల్మెట్ ధరించి ఉండగా మరొకరు మాస్క్ ధరించి ఉన్నారు. నేను మొదటి అంతస్తులోనే ఉండి కొరియర్ వివరాలు అడిగాను. అమిత (నా పేరు), ఎన్‌కె జైన్ (నా భర్త) పేర్లు చెప్పి కొరియర్ వచ్చిందని చెప్పారు. అక్కడే ఉండాలని, వచ్చి తీసుకుంటామని చెప్పాను. నేను కిందికి వచ్చేసరికి గేటు లోపలి నుంచి గుమ్మం వద్దకు వచ్చేశారు.

ఎదుర్కొని .. కనిపెట్టి..

బ్యాగ్‌లో నుంచి కొరియర్ పార్శిల్ తీస్తున్నట్లుగా తీసి ఒకరు తపంచా (నాటు తుపాకీ)తో నాపై ఎక్కుపెట్టాడు. మరొకరు నన్ను తోసుకుంటూ లోపలికి వచ్చి కిచెన్‌లో ఉన్న పనిమనిషి మెడపై కత్తి పెట్టాడు. నా అరుపులకు మొదటి అంతస్తులో ఉన్న కుమార్తె కూడా వచ్చింది. మాపై అటాక్ చేస్తుండగా మేం కూడా తిరిగి అటాక్ చేశాం. ఇద్దరం కలిసి ఆ వ్యక్తి చేతులను గట్టిగా పట్టుకుని వెనక్కి తిప్పి, తపంచాను లాగేసుకున్నాం. దీంతో అచేతనుడైన ఆ వ్యక్తి వెంట తెచ్చుకున్న తాళ్లతో మమ్మల్ని కట్టేసేందుకు ప్రయత్నించగా, ఎదురుతిరిగాం. దాదాపు 20 నిమిషాల సేపు ఘర్షణ జరిగింది. చివరకు ఆ వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేశాడు. మమ్మల్ని బలవంతంగా తోసుకుంటూ బయటకు వచ్చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు మేము ఎంతగానో వెంబడించాం. ఆ వ్యక్తి పారిపోయాడని తెలుసుకుని కిచెన్‌లో ఉన్న మరో వ్యక్తి ఎక్కడ దొరికిపోతాడో అని ఆందోళనపడ్డాం. అతను కూడా పారిపోయేందుకు కత్తితో బెదిరిస్తూ బయటకు వచ్చాడు. మా అరుపులకు ఈ లోగా స్థానికులు రావడంతో అతన్ని పట్టుకోగలిగాం. తెలిసిన వారే అయ్యుంటారని మేం వారు ధరించిన హెల్మెట్, మాస్క్‌ను తీసేయడంతో వారెవరో కనిపెట్టగలిగాం. కిందటేడాది దీపావళి సమయంలో పది రోజులపాటు మా ఇంటి క్లీనింగ్ విషయంలో ఓ ఏజెన్సీని సంప్రదిస్తే, వారు పంపించిన వ్యక్తులే వీళ్లు. మా ఇంటిని క్లీన్ చేసే సమయంలో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో గమనించి, ఇంట్లో ఆడవాళ్లం మాత్రమే ఉండే సమయం చూసి, ఇలా దొంగతనం చేయడానికి ప్లాన్ చేసుకున్నారని తెలిసింది. మేం ఎదురు తిరగడంతో వచ్చిన పని గురించి కాకుండా మేము తమ ముఖాలను చూడకుండా కాపాడుకునేందుకే ఎక్కువ ప్రయత్నం చేశారు.

ఆత్మరక్షణకై మెలకువలు అవసరం

మహిళలు ఆత్మరక్షణ దిశగా మెలకువలను నేర్చుకోవాలి. ఇప్పుడు నా జీవితంలో ఎదురైన అనుభవం లాగా ఎవరి జీవితాల్లోనూ రాకూడదని కోరుకుంటాను. ఒక వేళ వస్తే మాత్రం అందుకు సిద్ధంగా ఉండాలి. ధైర్యంగా ముందడుగు వేయాలి.

– అమిత



ఆ ధైర్యం ఎలా వచ్చిందంటే..

గతంలో ఐదేళ్లు బాక్సింగ్ ప్రాక్టీస్ చేశాను. రోజూ జిమ్‌కు వెళ్తుంటాను. మార్షల్ ఆర్ట్స్‌పై కూడా అవగాహన ఉంది. అవే నన్ను ధైర్యంగా ఉండేలా, సాహసం చూపేలా చేశాయి. ఎదురొచ్చిన విపత్తు నుంచి కాపాడేలా చేశాయి. ఒక తపంచా, రెండు కత్తులు, తాళ్ల సహాయంతో వారు మమ్మల్ని లొంగదీసుకునేందుకు చేయని ప్రయత్నమంటూ లేదు. వారి ప్రతి చర్యను తిప్పికొట్టగలిగామంటే బాక్సింగ్, ఫిట్‌నెస్‌లే కారణమని కచ్చితంగా చెప్పగలను'' అని తామ ఎదుర్కొన్న సంఘటనను వివరించారు అమిత.

ఈ తల్లీకూతుళ్లు దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ ఘటన తర్వాత అమిత, ఆమె భర్త, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

డీసీపీ ప్రశంసలు.. సన్మానం..

అమిత, ఆమె కుమార్తె బాబీ ఇద్దరూ చూపిన ధైర్యసాహసాలు ఆదర్శప్రాయం అని నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బేగంపేట పైగా కాలనీలోని అమిత నివాసానికి నేరుగా వచ్చిన డీసీపీ అమితతో పాటు ఆమె కుమార్తెనూ ప్రశంసించి, శాలువాతో సత్కరించారు. మైనర్ బాలిక అయినా ఆమె చూపిన తెగువ ఎంతో అభినందనీయమన్నారు.

– కోట కృష్ణారావు, సాక్షి, హైదరాబాద్

బ్యూటిప్స్

పార్లర్‌తో పని లేదు...

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.



- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి వేసి ముఖంపైన అద్దాలి. తరువాత చేతులతో సున్నితంగా మర్దన చేసి కడిగేయాలి.



- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.
- అరటిపండు గుజ్జులో కొద్దిగా కొబ్బరినూనె వేసి కలిపి ముఖానికి పట్టించాలి. ఇరవై నిమిషాల తరువాత మర్దన చేసి నీటితో కడిగేయాలి. ఇది మంచి క్లెన్సర్‌గా పనిచేయడమేగాక, చర్మానికి తేమనందిస్తుంది.

ఇంటిప్స్

సీలింగ్ ఫ్యాన్ ఇలా శుభ్రం

సాధారణంగా సీలింగ్ ఫ్యాన్‌లను ఎక్కువ ఎత్తులో అమర్చుతారు. అందువల్ల వాటిని తరచు శుభ్రం చేయడం చాలా కష్టం. అలాగని నెలల తరబడి అలాగే ఉంచేస్తే మురికి పేరుకుని పోయి అసహ్యంగా కనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో పాత పిల్లో కవర్ తీసుకుని టేబుల్ మీద ఎక్కి సీలింగ్ ఫ్యాన్ రెక్కలను కవర్ చేయాలి. కవర్ పైభాగం నుంచి మీ చేతులతో రుద్దాలి. అదేవిధంగా, మూడు రెక్కలను శుభ్రం చేయాలి. మట్టి కూడా కవర్‌లో పడిపోతుంది. ఇది మీ ఇంటిని కూడా మురికిగా చేయదు.

మరో పద్ధతి...

పాత షర్ట్, టీషర్ట్ లేదా ఏదైనా కాటన్ వస్త్రం సహాయంతో ఫ్యాన్‌ను శుభ్రం చేయవచ్చు. ఫ్యాన్ మీద పొడి దుమ్ము ఉంటే.. అది సులభంగా ఒక వస్త్రంతో శుభ్రం చేసుకోవచ్చు. ఒకవేళ వంటగదిలో ఉండే ఫ్యాన్‌ను క్లీన్ చేస్తున్నట్లయితే.. దానిపై నూనె, ధూళి పేరుకుపోయి ఉంటుంది. అటువంటి వాటిని సబ్బుతో కడగడం మంచిది. కాసేపు రెక్కలను స్క్రబ్ చేయాలి.



గుర్తుంచుకోవాల్సింది..

ఫ్యాన్‌ను క్లీన్ చేసినప్పుడల్లా కింద ఒక షీట్ లేదా వస్త్రాన్ని పరచాలి. దీంతో ఫ్యాన్ క్లీన్ అయిన తర్వాత మీకు పని పెరగదు. ఫ్యాన్ మురికి షీట్లో పడిపోతుంది.

ఫ్యాన్ శుభ్రం చేసేటప్పుడు గ్లాసెస్ లేదా సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది చెత్తను కంట్లో పడకుండా చేస్తుంది. దీంతో అలర్జీ కూడా రాదు. సీలింగ్ ఫ్యాన్ శభ్రం చేసేటపుడు ముక్కుకు మాస్క్ లేదా రుమాలు కట్టుకోవాలి.

హోలీ
రంగు పడే ఊళ్లు

తీర్థయాత్రలు చేస్తారు కొందరు. వర్ణయాత్రలు కొందరికి ఇష్టం. మన దేశంలో హోలి చాలా హుషారైన పండగ. బహుశా దీపావళి తర్వాత చిన్నా పెద్దా అందరూ కేరింతలతో పాల్గొనే పండగ ఇదే. రొటీన్ జీవితంలో రంగులను నింపుకోవడం బాగుంటుంది. అయితే కొందరికి ఇంట్లోనో, అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోనో, వీధిలో, ఏరియా చౌరస్తాలోనో ఆడే హోలీ పెద్దగా ఆనదు. వారికి భారీ హోలి వేడుక చూడాలనిపిస్తుంది. అలాంటి వారి కోసం హోలి డెస్టినేషన్స్ ఉన్నాయి. మన దేశంలో. ఈ హోలీకి వెళ్లగలిగితే వెళ్లండి.

మధుర:

ఉత్తరప్రదేశ్‌లోని మధురలో హోలి వేడుకలు చూడటం అంటే కృష్ణ రాధలు ఆడే హోలిని చూసినట్టే. ఇక్కడి బర్సానాలో స్త్రీలు గోపికల్లా, పురుషులు గోపబాలురలా అలంకరించుకుని హోలి ఆడతారు. రంగులు చల్లడానికి వచ్చిన గోపబాలురను స్త్రీలు సరదాగా బడితెలతో బాది దూరం తరుముతారు. అందుకే దీనిని 'లాత్‌మార్ హోలి' అంటారు.






బృందావన్:

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌కు వెళితే అక్కడి బన్‌కె బిహారి ఆలయంలో పూలు, రంగులు కలిపి చల్లుకుంటూ కోలాహలంగా హోలి నిర్వహిస్తారు. అందుకే దీనిని 'ఫూల్‌వాలోంకి హోలి' అంటారు. ఇక్కడ ఒకరోజు రెండు రోజులు కాదు... వారం రోజులపాటు హోలి వేడుకలు జరుగుతునే ఉంటాయి. చుట్టుపక్కల పల్లెలు రంగులతో తెల్లారి రంగులతో అస్తమిస్తాయి. ఈ అద్భుతమైన వేడుకలను చూడానికి టూరిస్ట్‌లు వస్తారు.

ఉదయ్‌పూర్:

ఇక రాచరికస్థాయిలో హోలి చూడాలంటే రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు వెళ్లాలి. అక్కడి సిటీ ప్యాలెస్‌లో రాజ వంశీకుల హాజరీలో అద్భుతమైన హోలి వేడుకలు జరుగుతాయి. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాజస్థానీ జానపద కళల ప్రదర్శన ఉంటుంది. టూరిస్ట్‌లు ఈ వేడుకలు చూడటానికి తెగబడతారు.



హంపి:

తుంగభద్ర నది ఒడ్డున రంగుల పండగ ఎలా ఉంటుందో చూడాలంటే హంపి వెళ్లాలి. ఇక్కడ హంపి సందర్భంగా భారీగా అలంకరించి నిర్వహించే రథయాత్ర చూడటానికి రెండు కళ్లూ చాలవు. ఈ సాంస్కృతిక క్షేత్రంలో హోలీ ఒక విచిత్ర భావన కలిగిస్తుంది. నగర ప్రజలు డోళ్లు మోగిస్తూ హోలి వేడుకల్లో విశేషంగా పాల్గొంటారు. విరూపాక్ష ఆలయం ఈ సందర్భంగా కళకళలాడిపోతుంది. దక్షిణాదివారు హోలీ సెలవు హంపిలో గడిపి ఆనందించవచ్చు.



శాంతినికేతన్:

పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌లో హోలి అయితే నయనానందమూ శ్రవణానందమూ కూడా. ఎందుకంటే అక్కడ హోలి అంటే రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు... నృత్యాలు, సంగీతం, కవిత్వం... అమ్మాయిలు అబ్బాయిలు కలిసి మనోహరంగా హోలి జరుపుకుంటారు. రవీంద్రనాథ్ ఠాగూర్ మొదలెట్టిన ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. ఇక్కడకు వెళ్లి హోలి చూసినవారి హృదయం కచ్చితంగా రంగులతో నిండిపోతుంది.



ఆనంద్‌పూర్ సాహిబ్:

పంజాబ్‌లోని ఈ ఊళ్లో హోలీ రంగులకు కళ్లు చెదురుతాయి. నిహంగ్ సిక్కులు ఇక్కడ హోలి సమయంలో యుద్ధ విద్యలు ప్రదర్శిస్తారు. ఉత్తుత్తి పోరాటాలు ఇరు జట్ల మధ్య జరుగుతాయి. డోళ్లు తెగ మోగుతాయి. ఆట పాటల అట్టహాసం చూడతగ్గది.

